క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలి



నూజెండ్ల: నాణ్యతా ప్రమాణాలతో చేపట్టిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లింపులు చేస్తామని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని పాతనాగిరెడ్డిపల్లె, చెరుకుంపాలెం, ఐనవోలు గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన ఇంకుడు గుంతలు, డ్రైనేజీ నిర్మాణం, సిమెంటు రోడ్ల పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనుల నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అల్లా బక్షు, ఏపీవో ఆంజనేయరాజు పాల్గొన్నారు.

బ్లాక్ లెవల్ హెల్త్ సెంటర్ పనులు పూర్తి



నూజెండ్ల: స్థానిక ప్రాథమిక వైద్యశాల ఆవరణలో బ్లాక్ లెవల్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులు పూర్తయినట్లు ఆర్ అండ్ బీ ఏఈ కంచేటి నవ్య సోమవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.50 లక్షల వ్యయంతో పనులు పారదర్శకంగా చేశామని చెప్పారు. నూజెండ్ల పబ్లిక్ హెల్త్ సెంటర్‌కు భవనాన్ని అప్పగించనున్నట్లు తెలిపారు. విపత్తుల సమయంలో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు సిద్ధం చేయడానికి హెల్త్ సెంటర్ ఉపయోగపడుతుందని ఏఈ నవ్య తెలిపారు.

అంగన్‌వాడీలకు కొనసాగుతున్న శిక్షణ




వినుకొండ : జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్‌కు శిక్షణ కొనసాగుతోంది. ఐదో రోజులో భాగంగా సోమవారం పట్టణంలోని 9వ వార్డు పాఠశాల ప్రాంగణంలో చిన్నారులకు బోధన తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ పి. ప్రకాశరావు, ఎ-సెక్టార్ సూపర్‌వైజర్ శేషు కుమారి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినుకొండ మండల విద్యాశాఖ అధికారి సయ్యద్ జఫ్రుల్లా పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ తయారు చేసిన వివిధ సమూనాలను పరిశీలించారు. విద్యార్థులకు అవి ఉపయోగపడే విధానాన్ని అంగన్‌వాడీ టీచర్స్ వివరించారు.

వర్సిటీ హ్యాండ్‌బాల్ జట్టుకు భాగ్యశ్రీ ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా హ్యాండ్‌బాల్ జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.భాగ్యశ్రీ ఎంపికైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. తెనాలి జేఎంజే మహిళా కళాశాలలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించిన వర్సిటీ మహిళా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలలో భాగ్యశ్రీ ప్రతిభ కనబరిచి జట్టులో స్థానం సాధించిందని వివరించారు. చెన్నైలోని పెరియార్ విశ్వవిద్యాలయంలో మార్చి 2వ తేదీ నుంచి జరగనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏఎన్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యశ్రీని వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

రెడ్డి పేరంటాలమ్మ ఆలయానికి విరాళం



నాదెండ్ల: గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరులో గల శ్రీ రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. గ్రామానికి చెందిన నర్రా సీతయ్య కుమారుడు రమేష్ కుటుంబ సభ్యులు సోమవారం ఆలయ నిర్మాణానికి రూ.1,00,000ను కమిటీ సభ్యులకు అందించారు. చారిత్రాత్మక పేరంటాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి గతేడాది శ్రీకారం చుట్టారు.రూ.2 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. మార్చి 17న ఉదయం 10.30 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శనగ రైతుకు మద్దతు కరువు

- పెరిగిన సాగు ఖర్చులు
- అంతంతమాత్రంగా దిగుబడులు
- మార్కెట్లో ధర లేక రైతుల సతమతం
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్



గణపవరంలో శనగ పంట నూర్పిడి చేస్తున్న యంత్రం

నాదెండ్ల: ఈ ఏడాది ఆహార, వాణిజ్య పంటల సాగు రైతులకు నష్టాలను మిగిల్చింది. సరైన దిగుబడి లేదు. మార్కెట్లో ధర కూడా అంతంతమాత్రంగానే ఉంది. ప్రభుత్వం కూడా కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయకపోవడం రైతులను కలవరపాటుకు గురి చేస్తోంది. గత డిసెంబర్‌లో ఫెంగల్ తుపాను కారణంగా పత్తి పంట దెబ్బతిని భారీగా దిగుబడి తగ్గింది. పులి మీద పుట్రలా జెమిని వైరస్, ఇతర తెగుళ్లతో మిర్చి దిగుబడి పడిపోయింది. దీనికితోడు గతేడాది కన్నా ఈ ఏడాది సగానికి సగం ధరలు పడిపోయాయి. పొగాకు దిగుబడి బాగానే ఉన్నా ధరల పతనంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ఆదుకోని శనగ, కంది సాగు

ఈ ఏడాది ప్రధాన పంటలతో పాటూ శనగ, కంది సాగుల పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. గత ఏడాది రైతులు రెండు వేల ఎకరాల్లోనే శనగ సాగు చేయగా, ఈ ఏడాది 4600 ఎకరాల్లో చేపట్టారు. కంది గతేడాది 300 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 420 ఎకరాల్లో సాగైంది. శనగ ప్రస్తుత మార్కెట్లో క్వింటా రూ.5000-5500 మధ్య పలుకుతోంది. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5650లకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నేటి వరకూ పంటలకు మద్దతు ధరలు ప్రకటించలేదు. కనీసం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేయకపోవడంతో రైతులు నష్టానికే బహిరంగ మార్కెట్లో అమ్ముకునే పరిస్థితి నెలకొంది.



నాదెండ్లలో శనగ పంట పీకుతున్న కూలీలు

ముమ్మరంగా నూర్పిడి

గత పది రోజులుగా మండలంలో శనగ నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డిసెంబర్‌లో సాగైన పంట ఎకరాకు 8-10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. జనవరి సాగు చేసిన పంట దిగుబడి తగ్గి కేవలం 5-6 క్వింటాళ్లకే పరిమితమైంది. ప్రైవేటు వ్యాపారులు నాణ్యత లేదంటూ ధరలు తగ్గించేశారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

ఎకరా శనగ సాగుకు రూ.40 వేల పైచిలుకు ఖర్చవుతోంది. ఇందులో కౌలు రూ.12 వేలు, విత్తనాలు, పురుగు మందులు, కాంప్లెక్స్ ఎరువులు రూ.20 వేలు, కోత, నూర్పిడికి రూ.7 వేలు చొప్పున ఖర్చవుతుంది. డిసెంబర్‌లో సాగు చేసిన శనగ కొంత మేర ఊరటనిచ్చినా, జనవరిలో సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పలేదు.

పెట్టుబడి ఖర్చులు పెరిగాయి



మూడెకరాల్లో శనగ సాగు చేశా. కౌలుతో కలిపి సాగు ఖర్చు రూ.1 లక్షపైనే అయింది. మూడెకరాల్లో 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. డిసెంబర్‌లో సాగు చేయడంతో దిగుబడి బాగుంది. మార్కెట్లో ప్రస్తుతం క్వాలిటీని బట్టి ప్రైవేటు వ్యాపారులు రూ.5500కు మించి కొనుగోలు చేయడం లేదు.

– జంపని సురేష్, రైతు, గణపవరం

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



ఈ ఏడాది ఆరు ఎకరాల్లో శనగ సాగు చేశా. 50 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. ఎకరాకు సాగు ఖర్చు రూ.40 వేలు అయింది. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5650కు ప్రభుత్వమే కొనుగోలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనుగోలు చేస్తేనే రైతుకు లాభం కలుగుతుంది.

–బొప్పూడి రామారావు, రైతు, గణపవరం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిలకలూరిపేట: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత, నిర్వహణ, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని కోరారు. ప్రైవేట్ ఏజన్సీలకు అప్పజెప్పొద్దని విజ్ఞప్తి చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా స్కూల్ స్వీపర్లకు వేతనాలు పెంచలేదని, సత్వరమే పెంచాలని కోరారు. మరణించిన రిటైర్మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. అనంతరం మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమరగిరి చెంచయ్య, ఆక్కులయ్య, అంజయ్య, జయరావు పాల్గొన్నారు.



మున్సిపల్ డీఈఈకి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గీతమ్స్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు

వినుకొండ: పట్టణంలోని సిద్దార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని దాని సాధన కోసం శ్రమించాలని చెప్పారు. శ్రద్ధగా చదివి విజయాలను అందుకోవాలని తెలిపారు. అనంతరం గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు మెడికల్, ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గీతమ్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, పీపీ సురేష్, ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

నూజెండ్ల: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు అమల్లోకి వచ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం ఈవోపీఆర్డీ షేక్ రబ్బాని మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తా చెదారాన్ని ఎక్కడబడితే అక్కడ వేయవద్దని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటి దగ్గరకు వచ్చినప్పుడు రిక్షాలో వేయాలని చెప్పారు. దాన్ని చెత్త సంపద కేంద్రానికి తరలించి తడి, పొడి చెత్తా వేరుచేసి పంచాయతీకి అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, హసన్ పీరా,స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల శివరామయ్య , గ్రామపెద్దలు లగడపాటి సూరిబాబు, వెంకట్రావు, క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న రబ్బాని

భక్తులు పోలీసులకు సహకరించాలి

సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి తరలివచ్చే భక్తులు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. సోమవారం సత్రశాలలో విలేకరులతో విలేకర్లతో ఏర్పాట్లపై మాట్లాడారు. గురజాల, రెంటచింతల నుంచి వచ్చే వాహనాలకు మిట్టగుడిపాడు రోడ్డు మార్గాన అనుమతి లేదని తెలిపారు. వారు పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం నుంచి దేవస్థానానికి చేరుకోవాలని చెప్పారు. అన్నదాన సత్రాలకు సరుకులు, ఇతర వస్తువులు తెచ్చుకునేందుకు పాస్‌లున్న వారు మాత్రమే వాహనాలను సత్రాలలో నిలుపుకోవాలన్నారు. పాస్‌లు లేని భక్తులు పోలీసులు చూపిన పార్కింగ్ స్థలంలో వాహనాలను నిలుపుకోవాలని స్పష్టం చేశారు.



ఆటోలను సత్రశాల వడియరాజుల సత్రం వరకు అనుమతిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో దేవస్థానం పరిసరాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా దైవదర్శనం చేసుకుని, పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరిగి వెళ్లేలా ప్రతి ఒక్కరూ పోలీసు సిబ్బందికి, వలంటీర్లకు సహకరించాలని కోరారు.

కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం న్యాయవాద చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు నాలుగు కోర్టుల్లో విధులను బహిష్కరించారు. పట్టణంలోని తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయ దేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం న్యాయవాద చట్టం (1960)ను సవరణ చేయాలనే ఉద్దేశంతో బిల్లును తయారు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బి.ఎల్.చిన్నయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, రాజశేఖరుని గోపాల కృష్ణమూర్తి, బి.అమర్ నాయక్, షేక్ నాగూర్ బాబు, బాదరబోయిన వెంకటేశ్వరరావు, పిట్టల సురేష్, షేక్ నాగులా, తెనాలి జ్యోతిబాబు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం పిచ్చిరెడ్డి మృతి

రొంపిచర్ల : మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కురుగంటి పిచ్చిరెడ్డి (85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు కురుగంటి శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా పని చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పిచ్చిరెడ్డి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. ఆయన మృతి విద్యారంగానికి తీరని లోటని తెలిపారు. పిచ్చిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి

ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ హీరాలాల్


రొంపిచర్ల : ప్రభుత్వ కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొనాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.హీరాలాల్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న హీరాలాల్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. సీఐఎఫ్, వీఆర్‌ఎఫ్, ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంక్ లింకేజ్ పథకాలపై అవగాహన కలిగించారు. రుణాలను నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. స్త్రీనిధి ఎన్‌పీఏ ఉన్న గ్రూపు సభ్యులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం సోమశేఖర్, సీసీలు సత్యనారాయణరాజు, పార్వతి, ఆదిలక్ష్మి, అకౌంటెంట్ రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హీరాలాల్

కొండకు వస్తున్నాం కోటయ్యా !


గ్రామాల నుంచి సందడిగా బయలుదేరిన ప్రభలు



కోటప్ప కొండకు వెళుతున్న కాకాని ప్రభ



విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతున్న అప్పాపురం ప్రభ



అమీన్ సాహెబ్‌పాలెం గ్రామ ప్రభ

నరసరావుపేట రూరల్: మండలం నుంచి మూడు భారీ విద్యుత్ ప్రభలు కోటప్ప కొండకు వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. కాకాని, గురవాయపాలెం, ఉప్పలపాడు గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. కాకాని విద్యుత్ ప్రభ సోమవారం ఉదయం గ్రామం నుంచి బయలుదేరింది. గ్రామస్తులు అంతా ప్రభ వెంట నడిచారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రికి ప్రభల నిధికి చేరింది. ఉప్పలపాడు ప్రభను సోమవారం నిలబెట్టారు. సాయంత్రం ఊరి చివరకి తరలించారు. మంగళవారం కోటప్ప కొండకు చేరుకోనుంది. గురవాయపాలెం ప్రభ కూడా మంగళవారం కొండకు బయలుదేరనుంది.

పోట్లూరు ప్రభ సిద్ధం

మహా శివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండ తిరునాళ్లకు ఏటా మండలంలోని పోట్లూరు గ్రామం నుంచి వంతులు వారీగా మొక్కుబడి ప్రభ తయారు చేసి తరలించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రిటిష్ పాలనలో పొలాల దగ్గర వివాదాలు ఎక్కువయ్యాయి. అప్పట్లో పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. కోర్టులో కొన్ని సంవత్సరాలు వాదనలు జరిగాయి. విసుకెత్తిన గ్రామస్తులు కోర్టు కేసు గెలుపు కోసం కోటయ్య స్వామిని ప్రార్థించారు. విజయం సాధిస్తే ఏటా ప్రభలతో వస్తామని మొక్కుకున్నారు. కేసులో విజయం సాధించడంతో గ్రామస్తులు ఐక్యంగా ఏటా వంతులు ప్రకారం కోటప్పకొండ తిరునాళ్లకు ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. కొండపై కోటయ్య స్వామిని నేరుగా గర్భగుడిలోకి వెళ్లి దర్శించడానికి అప్పట్లో బ్రిటిష్ కాలం నాటి పోలీసులు ఇచ్చిన అనుమతి పత్రం ఉందని గ్రామస్తులు తెలిపారు.ఈ సందర్భంగా మంగళవారం విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి, రాత్రి గ్రామంలో వైభవంగా ఊరేగించారు.శివరాత్రి పర్వదినం రోజున నందీశ్వరుని విగ్రహాలతో ప్రభను కోటయ్య కొండకు ట్రాక్టర్లపై తరలిస్తారు.

ప్రభలకు గ్రామోత్సవం

నాదెండ్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురంలో గ్రామ భారీ విద్యుత్ ప్రభలు సిద్ధమయ్యాయి. గత నెల రోజులుగా గ్రామస్తులు నిర్మిస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామాల్లో రెండు ప్రభలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఒక్కో ప్రభ 90 అడుగుల ఎత్తుతో రూ.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మంగళవారం ప్రభలు కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధికి బయలుదేరతాయి. 26వ తేదీ ఉదయానికి నిర్దేశిత ప్రాంతానికి చేరుకోనున్నాయి. పండుగ రోజు రాత్రి దేదీప్యమానంగా విద్యుత్ కాంతులతో వెలిగిపోనున్నాయి. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం తిరిగి స్వగ్రామాలకు బయలుదేరతాయి. చివరగా మరోసారి ప్రభలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



శావల్యాపురం: పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితకుమారి, శ్రీరామా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చంద్, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి,అబ్దుల్లా, నిర్మల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: మహా శివరాత్రి పురస్కరించుకుని కోటప్పకొండ తిరునాళ్లకు ప్రభలు వెళ్లేందుకు ఆటంకం లేకుండా పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తొలగిస్తున్నట్లు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. దీనివల్ల మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని బొప్పూడి, పోతవరం, మద్దిరాల, యడవల్లి, కట్టుబడివారిపాలెం, కావూరు, లింగంగుంట్ల, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం గ్రామాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వెల్లడించారు.

నాదెండ్లలో..

మహా శివరాత్రిని పురస్కరించుకుని కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల నుంచి మంగళవారం ఉదయం విద్యుత్ ప్రభలు తరలించనున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల, దాచేపల్లిల నుంచి నాయకులు హాజరయ్యారు. జిల్లా నాయకులు ఉప్పల పాటి రంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షులు కాసా సాంబయ్య, బాషా, సుభాని, అప్పారావు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటా కొనుగోలు

వినుకొండ: సబ్ డివిజన్ పరిధిలో టమాట రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా చర్యలు చేపట్టినట్లు వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ తెలిపారు. నాణ్యతను బట్టి కిలో రూ.8 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రవాణా ఖర్చులను కూడా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ భరిస్తుందని తెలిపారు. ఇతర జిల్లాలకు తరలించి రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు అమ్మనున్నట్లు ఆయన పేర్కొన్నారు. టమాటా రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.